అన్నా క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ సందర్శన

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : వన్ టౌన్ పరిధి పోర్టు జింఖానా రోడ్డులోని ఫ్రూట్స్ మార్కెట్ వద్దనున్న అన్నా క్యాంటీన్ ను జిల్లా కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్ గురువారం సందర్శించారు. మధ్యాహ్నం భోజనం సమయానికి వెళ్లిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. భోజనం చేస్తున్న యువకులు, వృద్ధులతో మాట్లాడి భోజన రుచి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తూ అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం కలెక్టర్ అన్నా క్యాంటీన్ పరిసరాలను పరిశీలించారు. చేతులు కడిగే బేసిన్లు, తాగునీటి వసతి, టికెట్ కౌంటర్ల వద్ద క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ అందుతున్న సేవలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రోజూ సమయపాలన పాటిస్తూ.. వేడివేడిగా ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలని ఈ సందర్భంగా నిర్వాహకులను కలెక్టర్ ఆదేశించారు.

విద్యుత్ విధానాలను వ్యతిరేకించండి.... ఉద్యమాలకు మద్ధతివ్వండి

ప్రజలకు అఖిలపక్షాల పిలుపు...

విశాలాంధ్ర-మధురవాడ : విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాట్లు, సర్దుబాటు చార్జీలు రద్దుతో పాటు, అదానీతో జరిగిన విద్యుత్ ఒప్పందాలను రద్దు డిమాండ్ల తోఆగస్టు 2వ తేదీన మధురవాడ విద్యుత్ ఇఇ కార్యాలయం వద్ద, 5వ తేదిన సీతమ్మధార విధ్యుత్ ప్రధాన కార్యాలయం వద్ద చేపట్టే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని ప్రజలకు అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485 కోట్ల భారం ప్రజలపై మోపిందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మరుపిళ్ల పైడిరాజు, సిపిఎం జిల్లా నాయకుడు దొడ్డి అప్పలరాజులు తెలిపారు. గురువారం మధురవాడ సిపిఐ కార్యాలయంలో వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ గృహాలకు స్మార్ట్ మీటర్లను బిగించేందుకు కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నదని, కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలు ఇచ్చి విద్యుత్ చార్జీల భారాలను మోపటం ప్రజలను దారుణంగా మోసగించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉండగా విద్యుత్ చార్జీల పెంపుదలను తీవ్రంగా వ్యతిరేకించారని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోవాలని, అవసరమైతే పగలగొట్టాలని సూచించారని, ఆదానీతో జరిగిన సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేస్తామని, అక్రమంగా జరిగిన సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. కాని రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన ఏడాది కాలంలో 4 సార్లు విద్యుత్ చార్జీల భారాలను వినియోగదారులపై మోపారు. గృహ వినియోగాలకు సంబంధించి విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించేందుకు సిద్ధమయ్యారని, గత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆదానీతో చేసుకున్న ఒప్పందాల వల్ల రానున్న 25 ఏళ్లపాటు దాదాపు ఒక లక్షా పదివేల కోట్ల రూపాయల భారం ప్రజలపై పడుతుందని మొసలి

కన్నీరు కార్చారని, ఈ ఒప్పందాలపై కూటమి ప్రభుత్వం సమీక్ష చేయకపోవటమే గాక కనీసం నోరు మెదపడం లేదన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు తగ్గించాలనిబీ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవటం తో పాటు అదానీతో జరిగిన సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని సిపిఐ, సిపిఎం వామపక్ష ప్రజాసంఘాలు డిమాండ్ చేసారు. ప్రజలపై విద్యుత్ పెనుభారాలను వ్యతిరేకిస్తూ ఆగస్టు 2వ తేదీన మధురవాడ విద్యుత్ ఇ ఇ కార్యాలయం వద్ద, 5 వ తేదిన సీతమ్మధార విద్యుత్ ప్రాంతీయ కార్యాలయం వద్ద నిరసనలలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశలో సిపిఐ, సిపిఎం సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐద్వా, మహిళా సమాఖ్య, అఖిల భారత విద్యార్థి సమైఖ్య, అఖిలభారత యువజన సమైఖ్య, నాయకులు జె డి నాయుడు, పి రాజ్ కుమార్, వి సత్యనారాయణ, వార్డు నివాస్ నాయకుడు బి ఎస్ మూర్తి, ఎం డి బేగం, బి భారతి, డి కొండమ్మ, కె అత్యుతరావు, శేఖర్,కె సుజాత, ఎం ఎస్ పాత్రుడు, కె మేఘూరావు తదితరులు పాల్గొన్నారు.

28వ వార్డులో పలుచోట్ల తారురోడ్ల నిర్మాణానికి మేయర్ శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : విశాఖ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పనే కూటమి ప్రభుత్వం లక్ష్యమని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం ఆయన జీవీఎంసీ 4వ జోన్ 28వ వార్డు పరిధిలోని రామ్ నగర్ లో పలుచోట్ల తారు రోడ్డు నిర్మాణానికి తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, వార్డ్ కార్పొరేటర్ పల్లా అప్పలకొండతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖ నగరాభివృద్దే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని పేర్కొన్నారు. నగరంలోని ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు జీవీఎంసీ అన్ని చర్యలు చేపడుతుందని తెలిపారు. 28వ వార్డులో జీవీఎంసీ నిధులతో పలు ప్రాంతాలలో సుమారు రూ. 58.35 లక్షల వ్యయంతో తారు రోడ్ల నిర్మాణానికి శాసనసభ్యులతో కలిసి శంకుస్థాపన చేశామన్నారు. జీవీఎంసీ పరిధిలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టేందుకు అనునిత్యం కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. అనంతరం తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి విశాఖను ఆర్థిక రాజధానిగా ప్రకటించి అనేక ప్రజలకు అందించే సంక్షేమ కార్యక్రమాలు తోపాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. 28వ వార్డులో సుమారు రూ.58.35 లక్షలు జీవీఎంసీ నిధులతో పలుచోట్ల తారు రోడ్ల నిర్మాణానికి మేయర్ తో కలిసి శంకుస్థాపన చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పల్లా దుర్గారావు, గొలగాని పోలారావు, జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, జీవీఎంసీ కార్య నిర్వాహక ఇంజనీరు, ఉప కార్య నిర్వహక ఇంజనీరు, సచివాలయం కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా ఆర్జిత సేవలు

విశాలాంధ్ర-సింహాచలం: :ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి ఆలయంలో వేదపండితుల వేదమంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా స్వర్ణ పుష్పార్చన, నిత్య కళ్యాణం నేత్ర పర్వంగా జరిగాయి. ఇంచార్జ్ కార్యనిర్వహణాధికారి వి త్రినాధరావు, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆదేశాల మేరకు పర్యవేక్షణాధికారి వాసు పర్యవేక్షణలో అర్చక స్వాములు వేకువ జామున స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవింద రాజ స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కళ్యాణ మండపం లో వేదికపై అధిష్ఠింపజేసి వేద మంత్రాలు నాధ స్వర మంగళ వాయిద్యాల నడుమ శ్రీ స్వామి వారి స్వర్ణ పుష్పార్చన, నిత్య కళ్యాణం ఆర్జిత సేవలు కమనీయంగా జరిగాయి. ఆర్జిత సేవల్లో భాగంగా ఉత్సవ మూర్తి గోవింద రాజ స్వామి వారిని మండపంలో అధిష్టింప జేశారు. పాల్గొన్న భక్తుల యొక్క గోత్ర నామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం సేవలను జరిపించారు. మంత్రపుష్పం, మంగళా శాసనాలు తర్వాత భక్తులకు వేదాశీర్వచనం, శేష వస్త్రాలు తీర్థ ప్రసాదాలు అందజేశారు. నిన్న, మొన్న వరుస సెలవులు కావటంతో సింహాద్రి నాధుని దర్శనం కు భక్తులు పోటెత్తారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి : ఆనంద్

విశాలాంధ్ర-గాజువాక : విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపు నిస్తాయని సీపీఐ జిల్లా సమితి సభ్యులు జి.ఆనంద్ పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో సుదీర్ఘ కాలం విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన ఉక్కు టౌన్ అడ్మిన్ అడిషనల్ టెక్నీషియన్ కరకు పోతయ్య ఆత్మీయ సత్కారం గురువారం ఘనంగా జరిగింది. కార్యక్రమం లో సీపీఐ నేత ఆనంద్ కరకు పోతయ్య దంపతులను శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోతయ్య విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉక్కు అధికారిణి సుధారాణి, ఉద్యోగులు సాయి రామరాజు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పీ4 కుటుంబాల దత్తత పై వత్తిడి చేయవద్దు

జిల్లా కలెక్టర్లకు సూచించిన సిఎస్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : అన్నదాత సుఖీభవ, స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్, నీటి వనరుల మరమ్మత్తు, పునరుద్ధరణ అంశాలపై రాష్ట్ర సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బంగారు కుటుంబాలను దత్తత చేసుకునే విషయంలో ఎవరినీ వత్తిడి చేయవద్దని సూచించారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చే మార్గదర్శులను గుర్తించి బంగారు కుటుంబాలను దత్తత ఇవ్వాలన్నారు. ఆగస్టు 15 కల్లా నిర్ణీత లక్ష్యాలను సాధించాలన్నారు. ఆగస్టు 16న ఈ కార్యక్రమాన్ని భారీ స్థాయిలో ప్రారంభించే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమం విషయంలో పలువురు జిల్లా కలెక్టర్ల సందేహాలను నివృత్తి పరిచారు. ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ పీయూష్ కుమార్ వర్చువల్‌గా ఈ సమావేశాలు పాల్గొని జిల్లా కలెక్టర్లు అనుసరించాల్సిన ఎస్‌ఓపిని వివరించారు.

గణనీయమైన వృద్ధి సాధిస్తున్న ఫ్లిప్ కార్ట్ షాప్సీ

విశాలాంధ్ర-విశాఖపట్నం : భారతదేశంలో వేగంగా ఎదుగుతున్న హైపర్ వాల్యూ ఇ కామర్స్ ప్లాట్‌ఫారమ్‌గా పేరుగాంచిన ఫ్లిప్ కార్ట్ యొక్క షాప్సీ తన నాలుగో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లిప్‌కార్ట్ షాప్సీ, రీజనల్ ఫ్లిప్‌కార్ట్ మార్కెట్‌ప్లేస్ బిజినెస్ హెడ్ కపిల్ తిరాని మాట్లాడుతూ 'భారత్ లైవ్ కింగ్/క్వీన్-సైజ్' ప్రారంభానికి బాటలు వేస్తూ, ఈ ప్లాట్‌ఫామ్‌పై దృష్టి సారించిన వినియోగదారులకు అసమానమైన డీల్స్‌ను అందించేందుకు తన నిబద్ధతను మరింత బలోపేతం చేస్తోందన్నారు. ఇప్పటికే 450 మిలియన్లకు పైగా యాప్ డౌన్లోడ్లు సాధించిన షాప్సీ, దేశవ్యాప్తంగా 19,000 పిన్ కోడ్లకు పంపిణీ చేస్తూ, మెట్రోల నుంచి టైర్ 4 ప్లస్ పట్టణాల వరకు అన్ని ప్రాంతాల్లో షాప్సీ తన ఉనికిని విస్తరించిందన్నారు. ఈ ఒక్క సంవత్సరంలోనే, 11.5 మిలియన్లకు పైగా కొత్త దుకాణదారులు షాప్సీలో చేరారని, వీరిలో చాలా మంది తమ మొదటి ఇ కామర్స్ అనుభవాన్ని షాప్సీ ద్వారానే ప్రారంభించారు. సంస్థ ఉనికి మరింత విస్తరించడంతో, భాగల్పూర్, మేదినీపూర్, దుండా, రాజ్‌నగర్‌తో సహా టైర్ 4 పట్టణాలు మరియు మారుమూల జిల్లాల నుండి గణనీయమైన డిమాండ్ పెరిగింది. ఇది షాప్సీ అందించే విలువ ఆధారిత ధరలు, వినియోగదారులకు అనుకూలమైన ఇంటర్‌ఫేస్, అలాగే స్థానిక అవసరాలకు సరిపోయే క్యూరేటెడ్ ఎంపికలపై పెరుగుతున్న నమ్మకాన్ని స్పష్టంగా సూచిస్తుందని తెలిపారు.

నేడు మధురవాడలో విద్యుత్ వుండని ప్రాంతాలు

విశాలాంధ్ర-మధురవాడ : నేడు ఆగష్టు 1వ తేది శుక్రవారం ఉదయం 09.00 నుండి మధ్యాహ్నం 02:30 గంటల వరకు 11కేవీ సేవానగర్ ఫీడర్ లైన్లు మరమ్మతులు, విద్యుత్ తీగలను తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించుట వంటి కార్యక్రమాల నిమిత్తము ఈ దిగువ ప్రాంతాలలో విద్యుత్ నిలుపుదల చేయబడు తుందని విధ్యుత్ జోన్111,ఆపరేషన్ ఏ.ఇ.బి. సింహాచలం నాయుడు ఒక ప్రకటపలో కోరారు.

విధ్యుత్ ఉండని ప్రాంతాలు : కొమ్మాది జంక్షన్, శ్రీనివాస నగర్, సాయిరాం కాలనీ, జీసిసి లేఔట్, టీచర్స్ లేఔట్, హౌసింగ్ బోర్డు కాలనీ, అమరావతి కాలనీ, సేవానగర్, డ్రైవర్స్ కాలనీ (సాయిరాం కాలనీ)పరిసర ప్రాంతాలు. దయచేసి వినియోగదారులు గమనించి తమకు సహక రించాలని ఆయన తన ప్రకటనలో కోరారు.

ఇస్కఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా క్షేత్రపాల్‌రెడ్డి, కే.సత్యాఆంజనేయ

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) విశాఖ జిల్లా ఇస్కఫ్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. వన్ టౌన్‌లోని కార్యాలయం లో గురువారం జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షులు కాగితాల రాజశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహులు ఇస్కఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు జేవీ. ప్రభాకర్ సమక్షంలో ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు.జిల్లా అధ్యక్షులుగా కె. క్షేత్రపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కే. సత్య ఆంజనేయ, కోశాధికారిగా రాం ప్రభు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఉప్పల అప్పలరాజు, అప్పన్న ఎన్నికైనట్లు ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా ఎస్‌వి ప్రసాద్, మధుమతి, పద్మారావు, బోసు బాబు కార్యదర్శులుగా సత్యవతి, సిహెచ్ మధు, శ్యాంసుందర్, బి వెంకట్రావు లను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా హేమవతి, జి. సూర్య కుమారి ఎన్నుకోబడ్డారు. వీరితోపాటు మరో పదిమంది కార్యవర్గ సభ్యులను కో ఆప్షన్ సభ్యులుగా తీసుకోవాలని సమావేశం తీర్మా నించింది. నూతన కార్యవర్గాన్ని సభ్యులంతా అభినందించారు.

ములగాడ, శ్రావణ్ షిప్పింగ్ కంపెనీ రోడ్డుకు మరమ్మతులు

విశాలాంధ్ర-మల్కాపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విప్, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు సూచనల మేరకు ములగాడ, శ్రావణ్ షిప్పింగ్ కంపెనీ మీదుగా షీలానగర్‌కు వెళ్లే రోడ్డు విపిటి విశాఖపట్నం ట్రస్ట్ వారిచే రోడ్డు మరమ్మతులు అవసరమైన చోట నూతన రోడ్డు నిర్మాణం పనులు చేపట్టింది. ఎమ్మెల్యే గణబాబు చొరవతోనే ఇది సాధ్యమైందని నాయకులు పేర్కొన్నారు. వాహన దారులకు అనేక ఇబ్బందులు పడేవారు. ఇక ముందు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వాహన దారులు ప్రశాంతంగా వెళ్లే వాతావరణాన్ని కల్పిం చారు. గ్రామ ప్రజలందరూ కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త ప్రాజెక్టుల ఏర్పాటుకు పూర్తి సహకారం

డీఐఈపీసీ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : పరిశ్రమల నిర్వహణకు, కొత్త ప్రాజెక్టుల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం నుంచి పూర్తి సహకారం ఉంటుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లాలోని పారిశ్రామిక వేత్తలు, వివిధ విభాగాల అధికారులతో కలెక్టరేట్ మీటింగు హాలులో గురువారం జరిగిన డీఐఈపీసీ (డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్పోర్ట్ అండ్ ప్రమోషన్ కమిటీ) సమావేశంలో కలెక్టర్ పలు అంశాలపై మాట్లాడారు. ముఖ్యంగా పారిశ్రామిక వాడల్లో అవస్థాపనా సౌకర్యాలు కల్పించటంపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ఏపీఐఐసీ ద్వారా కేటాయించిన భూముల్లో నిర్ణీత సమయంలో సదరు నిర్వాహకులు పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐలా ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు స్పందించిన కలెక్టర్ ఆటోనగర్, ఐటీ హిల్స్ ప్రాంతంలో ప్రత్యేక బస్ స్టాప్ లు ఏర్పాటు చేయాలని చెప్పారు. వడ్లపూడి వద్ద ఆర్వోబీకి సంబంధించిన పనులను పూర్తి చేయాలన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులకు త్వరితగతిన పరిష్కారం చూపాలని, తూనికలు కొలతలు శాఖ అధికారులు వే బ్రిడ్జిలను తనిఖీ చేయాలని చెప్పారు. వీఎంఆర్డీఏ ప్రచురించిన 2041 మాస్టర్ ప్రణాళికను ఒకసారి పరిశీలించి పారిశ్రామిక వేత్తలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

పీ-4లో చేరటం ద్వారా పేదరిక నిర్మూలనకు సహకరించండి : పారిశ్రామికవేత్తలంతా ప్రభుత్వం సంకల్పించిన పీ-4లో చేరాలని, పేదరిక నిర్మూలనతో తమవంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. దిగువ స్థాయిలో ఉన్న వారిని ఉత్తమ స్థాయికి తీసుకొచ్చేందుకు తోడ్పాటు అందించాలని, ఒక్కో ఇండస్ట్రీ కనీసం 50 కుటుంబాలను దత్తత తీసుకోవాలని కోరారు. పీ-4 అమలు, దత్తత విషయంలో ఎవరిపైనా ఎలాంటి ఒత్తిడీ ఉండదని, ఇదంతా పూర్తిగా స్వచ్ఛంద కార్యక్రమమని కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. దత్తత తీసుకున్న కుటుంబాలకు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, ఇతర రూపాల్లో కూడా సహాయం అందించవచ్చని పేర్కొన్నారు. చదువు, నైపుణ్య శిక్షణ, ఉద్యోగ కల్పన, ఉత్తమ భవిష్యత్తుకు విలువైన సలహాలు, సూచనల రూపంలో కూడా సహకారం అందించవచ్చని వివరించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం ఆదిశేషు, ఫ్యాక్టరీల చీఫ్ ఇన్స్పెక్టర్ సురేశ్ కుమార్, ఏపీఐఐసీ జెడ్ఎం సింహాచలం, వీసీటీ ఈఈ ముకుందరావు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, పలువురు పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

కామన్ సర్వీస్ రూల్స్ సమస్యలను పరిష్కరించాలి

రాష్ట్ర ఉపాధ్యాయుల సంఘం (ఎస్‌టియు) డిమాండ్

విశాలాంధ్ర -విశాఖ సిటీ : కామన్ సర్వీస్ రూల్స్ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఉపాధ్యాయుల సంఘం (ఎస్ టి యు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ మంది పైడ్రాజు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్ మేనేజ్మెంట్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను కాదని ప్రభుత్వ యాజమాన్యంలో పనిచేస్తున్న పాఠశాల సహాయకులు కు ఎంఈఓ 1గా ఎఫ్ఎసి బాధ్యతలు అప్పగించడం సరికాదు. రాష్ట్రంలో రెండు దశాబ్దాలకు పైగా పాఠశాల విద్యారంగాన్ని నాశనం చేస్తున్న సర్వీస్ రూల్స్ సమస్య కారణంగా జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు వివక్షకు గురి అవుతున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో 90 శాతానికి పైగా జిల్లా పరిషత్ పాఠశాలలో అందులో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ అతి తక్కువ మంది ఉన్న ప్రభుత్వ మేనేజ్మెంట్ ఉపాధ్యాయులను ఎంఈఓలుగా పదోన్నతులకు కల్పించడం దారుణమన్నారు. పదోన్నతుల విషయంలో ఎప్పుడో 50సంవత్సరాల ముందున్నటువంటి పద్ధతులను కొనసాగించడం అన్యాయం అన్నారు. జిల్లా పరిషత్ మేనేజ్మెంట్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ సంఘాలు గత 25 సంవత్సరాలుగా అటు ప్రభుత్వంలోనూ ఇటు న్యాయస్థానంలోనూ వారికి జరుగుతున్న అన్యాయాలను మొర పెట్టుకుంటున్నప్పటికి న్యాయం జరగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఉపాధ్యాయుల ఆందోళనను అర్థం చేసుకుని సమస్య పరిష్కారం చేసే కృషి చేస్తున్నప్పటికీ కొంతమంది వ్యక్తుల స్వార్థానికి ఒకటి రెండు సంఘాల అభ్యంతరాల వలన కోర్టులో మరల సమస్య మొదటికి వస్తుందన్నారు. దీని కారణంగా రాష్ట్రంలో విద్యారంగంలో ఎంఈఓ, డిప్యూటీ ఈవో, డైట్, జేఎల్ పదోన్నతులు నిలిచిపోయినాయని పేర్కొన్నారు. విజ్ఞులైన ఉపాధ్యాయులు సంఘాలు రాష్ట్రంలో వేరువేరు మేనేజ్మెంట్లను ఒకే గూడు క్రిందకు తీసుకువచ్చి సమ న్యాయ సూత్రాన్ని పాటిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని చక్కదిద్దాలన్నారు. మెజార్టీ ఉపాధ్యాయుల కోరిక, రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని గాడిలో పెట్టే ఆలోచనతో విద్యాసంస్థలను చేపడుతున్న ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రత్యేక దృష్టి సారించి కామన్ సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలని ప్రతి ఉపాధ్యాయుడు కోరుకుంటున్నాడన్నారు.

ఏయూలోని సమస్యలపై ఉన్నతాధికారులకు టీఎన్టీయూసీ వినతి

విశాలాంధ్ర-విశాఖపట్నం : ఆంధ్ర యూనివర్సిటీలో ఉద్యోగస్తుల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యల మీద ఆంధ్ర యూనివర్సిటీ తెలుగు నాడు ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య జీపి రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయ్ రావు ను కలిసి వినతి పత్రం అందజేశారు ప్రధానంగా ఉద్యోగస్తులు సమస్యలతో పాటుగా క్యాంపస్ లో ఎటువంటి రాజకీయ కార్యకలాపాలకు తావులేకుండగా ఉండాలని ఉద్యోగుల సంక్షేమ కోసం కృషి చేయాలని కోరారు. పెండింగ్ లో ఉండిపోయినటువంటి ఉద్యోగస్తుల ప్రమోషన్ ఇవ్వాలని, ఒకే విభాగంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారిని బదిలీలు చేయాలని, 28 రోజుల, మినిమం టైం స్కేల్ ఉద్యోగస్తుల పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని ఉన్నతాధికారులను కోరారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఉద్యోగస్తుల పట్ల సానుకూల దృక్పధంతో ఉంటావని నిరంతరం యూనివర్సిటీ అభివృద్ధితోపాటు ఉద్యోగాల సంక్షేమం కోసం కృషి చేస్తానని హామీ

ఇచ్చినట్టు చెప్పారు. పలు సమస్యలను తొందరలోనే పరిష్కరిస్తామని, క్యాంపస్ లో రాజకీయాలకు తావు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని, శత వసంతాల సంబరాలు వేల ఉద్యోగస్తులందరూ కూడా యూనివర్సిటీ పేరు ప్రఖ్యాతలు తీసుకొని వచ్చే విధంగా కష్టపడి అందరి మన్నలను పొందాలని వీసీ సూచించినట్టు టీఎన్‌టీయూసీ ప్రతినిధులు చెప్పారు. అదేవిధంగా యూనివర్సిటీ ఉద్యోగుల సమస్య పరిష్కారం కి తన వంతు కృషి చేస్తానని రిజిస్ట్రార్ హామీ ఇచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఒమ్మి నూకరాజు, ప్రధాన కార్యదర్శి బండారి దేవుడు, తిత్తి సాయి బలరాం, యాసీన్ బాబా, పైడి శ్రీనివాస్, ఆవల రమేష్, ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

అంత పెద్ద జంక్షన్‌కి... బస్ షెల్టర్ ఎక్కడ

- నిరంతర మార్కెట్‌తో నిత్యం రద్దీ
- పోలీసులకు సవాలుగా ట్రాఫిక్...
- రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లు నిర్మించాలి...
- పాత మార్కెట్‌ను కూరగాయలకి ఉపయోగించుకుంటే మేలు... - రైతులు, ప్రజలు విజ్ఞప్తి

విశాలాంధ్ర-ఆనందపురం : గతంతో పోలిస్తే ఇటీవల కాలంలో ఆనందపురం జంక్షన్‌కు మంచి పేరు ఉందని చెప్పవచ్చు. ఉత్తరాంధ్రకి పెద్ద మార్కెట్ అని పిలవబడే మహాత్మాగాంధీ రోజువారి పువ్వులు మార్కెట్‌తో ఆనందపురం జంక్షన్ కళకళలాడుతుంటుంది. రోజూ అనేక ప్రదేశాల నుండి ఇక్కడికి నిత్యం రైతులు, వినియోగదారులు, అమ్మకందారులు రోజువారి మార్కెట్లో లక్షల్లో వ్యాపారాలు సాగిస్తుంటారు. ఈ మార్కెట్ నిరంతరం అందరికీ 24 గంటలు అందుబాటులో ఉంటుంది. అటువంటి మార్కెట్ వద్ద వాహనాలతో తీవ్రమైన ట్రాఫిక్ తలనొప్పిగా మారింది. నేషనల్ హైవే అధికారులు నిర్మించిన ఆనందపురం ఫ్లైఓవర్ వద్ద నిర్మాణం సరిగా జరగలేదని అనేకమంది చెబుతున్నారు. ఎందుకంటే విశాఖ నుండి వస్తున్న వాహనాలు అటు శ్రీకాకుళం, విజయనగరం, చేరుకోవాలంటే ఇదివరకు బ్రిడ్జిపై నుండి వాహన రాకపోకలు సాగుతుండేవి. అప్పుడు ట్రాఫిక్‌కి అంతరాయం లేకుండా సజావుగా ఉండేది. కానీ ఎప్పుడైతే నూతన బ్రిడ్జి నిర్మించిన తర్వాత ట్రాఫిక్ అంతా తలమానికంగా తయారయింది. ఆనందపురం మండల కేంద్రంగా తయారవడంతో పాటు నాలుగు వైపుల నుంచి వాహనాలు క్రింది నుంచి సదూర ప్రాంతాలకు విజయనగరం, శ్రీకాకుళం, తగరపువలస, వెళ్లడంతో ట్రాఫిక్ పోలీసులకు తీవ్రమైన తలనొప్పిగా మారిందని చెప్పవచ్చు. అయితే విచిత్రం ఏమిటంటే ఇప్పటివరకు ఆనందపురం జంక్షన్‌లో అటు విజయనగరం, శ్రీకాకుళం వెళ్లే వైపుగాని, ఇటు పెందుర్తి వెళ్లే వైపు గాని ఒక బస్సు షెల్టర్ కూడా లేదంటే చాలా విడ్డూరం అని చెప్పవచ్చు. ఆర్టీసీ డిపో మేనేజర్ వచ్చి పరిశీలన చేసి మూడు నెలలు కావస్తున్నా... ఇప్పటివరకూ ప్రయాణీకుల కోసం ఒక బస్ షెల్టర్ కూడా నిర్మించలేదంటే ఆర్టీసీ వారి పనితీరు ఎలా ఉందనేది నిదర్శనంగా మనం చెప్పవచ్చు. దానికి తోడు మార్కెట్ హైవే పక్కనే కాబట్టి పూల వ్యాపారాలు చేసుకుని మహిళలు రోడ్డుపైనే వచ్చిపోయే వాహనాలను ఆపి క్రయవిక్రయాలు జరపడం తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు నివారించినప్పటికీ చర్యలు తీసుకున్నా సరే వాళ్ళ తీరు మారడంలేదని తెలుస్తుంది. పూల వ్యాపారులను రహదారిపైకి రాకుండా చేయాలంటే సర్వీస్ రోడ్డు పక్కనే ఇనుప బారికేడ్లు నిర్మిస్తే కొంతమేర ట్రాఫిక్‌ను, ప్రమాదాలను కొంతమేర నివారించవచ్చని ప్రయాణికులు చెబుతున్నారు. నేషనల్ హైవేలో ఉన్న పాత బస్ స్టాండ్‌లను ఉపయోగంలోకి తేవాలని, హైవే పార్కును బాగు చేసి క్రీడా ప్రేమికులకు ఆహ్లాదంగా తయారుచేస్తే, పార్కు పరిశుభ్ర పరిస్థితి ఉదయం సాయంత్రం వేళలు క్రీడా ప్రాంగణం ఆహ్లాదకరంగా ఉంటుందని, అలాగే నిరుపయోగంలో ఉన్న లోడగలవానిపాలెం మార్కెట్‌ను ఉపయోగంలోకి తీసుకున్నట్లయితే అందులో కాయగూరలు మార్కెట్ ప్రారంభించినట్లయితే ట్రాఫిక్‌ను మరింత తగ్గించవచ్చని, రైతులు వాపోతున్నారు. అలాగే పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని, మార్కెట్ రహదారిని మూసివేయడం జరిగిన కూడా పరిస్థితి మారడం లేదని, వెంటనే అధికారులు చొరవ తీసుకొని ముందుగా బస్‌స్టాప్ నిర్మించి, రహదారిపై పువ్వుల వ్యాపారాలు చేసుకునే వారిని నిలువరించేందుకు బారికేడ్లు ఏర్పాటు చేయాలని, నిరుపయోగంగా ఉన్న మార్కెట్‌ను ఉపయోగంలోకి తేవాలని, సంబంధిత అధికారులు, నాయకులు ఈ సమస్యపై వెంటనే దృష్టి సారించాలని వాహనదారులు, రైతులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నోటీసు

మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సమస్యల పరిష్కార కమీషన్ విజయవాడలో
MA No. 78/2025 in FA No.754/2018
(విశాఖపట్టణం జిల్లా వినియోగదారుల ఫోరమ్ 1, విశాఖపట్టణం వారి ఫైలు CC No. 137/2016)

బిట్వీన్:
యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ రిప్రజెంటెడ్ బై ఇట్స్ చైర్మన్ కం మేనేజింగ్ డైరెక్టర్ ...పిటీషనర్/అప్పిలెంట్
మరియు
శ్రీ నవపాల సీతారామయ్య వగైరాలు ...రెస్పాండెంట్స్

టు,
ఆర్-1: శ్రీ నవపాల సీతారామయ్య, తండ్రి రామమూర్తి, నివాస డోర్.నెం. 39-1-9 మాధవధార, విశాఖపట్టణం-7.
ఆర్-2: గుడ్‌హెల్త్ టి.పి.ఏ. సర్వీసెస్, ఫ్లాట్ నెం.49, నాగార్జున హిల్స్, పంజాగుట్ట, హైదరాబాద్-82, తెలంగాణ రాష్ట్రం.

పైనెంబరు పిటీషన్‌లో రెస్పాండెంట్లు అయిన మీకు పైస్టేట్ కమీషన్‌వారి ద్వారా, నోటీసు పంపినను మీకు ముట్టనందున మీకు ఈపేపర్ ప్రకటన ద్వారా నోటీసు చేయవలసినదిగా స్టేట్‌కమీషన్ వారు ఆర్డరువేస్తూ ది.03-09-2025కి వాయిదా వేసియున్నారు.సదరు వాయిదా రోజు ఉ॥గం॥10-30ని॥లకు మీరు స్వయంగా గాని లేక మీ అడ్వకేటు ద్వారా గాని పై కమీషన్ వారి ఎదుట హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటీషన్‌ను మీపరోక్షమందు విచారించి తీర్మానించబడును. (శ్రీ కమీషన్ వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది.03-09-2025

చేబ్రోలు యజ్ఞ నారాయణ, పిటీషనర్/అప్పిలెంట్ తరపు న్యాయవాది
కొత్తపేట, గుంటూరు.సెల్: 9848255609

ఆగస్టు 6వ తేదీన 1వ జోన్‌లో బహిరంగ వేలం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ 1వ జోన్ పరిధిలోని కొత్తగా నిర్మించిన వాణిజ్య సముదాయమునందలి గల 3 షాపు రూములకు ఆగస్టు 06 ఉదయం 11 గంటలకు 1వ జోన్ (భీమిలి) జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించబడునని జోనల్ కమిషనర్ ఇప్పినాయుడు గురువారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. మహా విశాఖ నగర పాలక సంస్థ, భీమిలి, జోన్-1 పరిధిలోని వార్డు నెం.1, సంతపేట సచివాలయం లో కొత్తగా నిర్మించిన వాణిజ్య సముదాయమునందలి గల 3 షాపు రూములకు తేది 06.08.2025 (బుధవారం) ఉదయం 11.00 లకు 1వ జోనల్ కార్యాలయము, భీమిలి నందు దిగువ తెలిపిన వివరాలు ప్రకారం బహిరంగ వేలము నిర్వహించచడం జరుగుతుందని తెలిపారు. వార్డు నెం.01 సంతపేట సచివాలయం లో కొత్తగా నిర్మించిన గ్రౌండ్ ఫ్లోర్ నందు గల షాపు రూము నెం.2(ఎస్.సి), 4,5(జనరల్) లకు మూడు సంవత్సరాల కాల పరిమితి వరకు వేలం పాట జరుగునని 1వ జోన్ జోనల్ కమిషనర్ తెలిపారు. కావున ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనేటప్పుడు వేలంపాటకు సంబంధించి ధరావత్తు మొత్తం డి.డి రూపంలో తీసుకురావాలని, ఎస్.సి రిజర్వుడు కేటగిరి వారు సంబంధిత కుల ధృవీకరణ పత్రం సమర్పించవలసి ఉంటుందని, వేలం పాటలో పాల్గొనే ప్రతి ఒక్కరు ఆధార్, పాన్ కార్డు కలిగి ఉండాలని, తదుపరి పూర్తి వివరణ కొరకు జోన్-1, భీమిలి కార్యాలయ పని దినములలో పర్యవేక్షకులను సంప్రదించగలరని జోనల్ కమిషనర్ తెలియజేశారు.

టిడిపి తీర్థం పుచ్చుకోనున్న పాలవలస ఎంపీటీసీ

- రౌతు శ్యామల వెంకట్రావు, పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు
- నేడో రేపో టీడీపీలో చేరనున్న పలువురు

విశాలాంధ్ర-అనందపురం : భీమిలి ఎన్డీఏ కూటమి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు నాయకత్వంపై పలువురు నాయకులు పార్టీలో చేరుతున్నట్లు వెల్లడించారు. గురువారం రామవరం గ్రామంలోని కాకర్లపూడి వరహాల రాజు, శ్రీకాంత్‌రాజు నివాసం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. గంటా శ్రీనివాసరావును నాయకత్వంలో పనిచేయాలనే నిశ్చయంతో పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా నేలతేరు గ్రామానికి చెందిన పాలవలస ఎంపీటీసీ రౌతు శ్యామల, వెంకట్రావు దంపతులు, గండిగుండం మాజీ పార్టీ అధ్యక్షుడు మధుపాడ శ్రీనివాసరావు, మాజీ వార్డు మెంబర్ కరకాన సత్తిబాబు, పాలవలస ఎంపీటీసీ సభ్యురాలు రౌతు శ్యామల, ఉపసర్పంచ్ చందక ఎల్లారావు, సీనియర్ నాయకులు రౌతు పెద్ద వెంకట్రావు, కంచి బోయిన తమ్ము నాయుడు తదితరులు వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గన్ రెడ్డి రమేష్, మాజీ సర్పంచ్ కాకర్లపూడి సీతారామరాజు, కనమాం సర్పంచ్ ఆబోతు అప్పలరాము, మదపాడ సత్తిబాబు, నిమ్మల అప్పలరాజు రెడ్డి, సబ్బవరపు శ్రీను, కొయ్య శ్రీను తదితర నాయకులు సమక్షంలో పార్టీలోకి ఆహ్వానించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

విశాలాంధ్ర-మధురవాడ : జీవీఎంసీ 5వ వార్డ్ మారికవలస రాజీవ్ గృహకల్ప, ఎంపీపీ స్కూల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం లక్ష్మివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోన్ టు ఇన్స్పెక్టర్ మంగరాజు ఆదేశాలతో సూపర్వైజర్ రామ్ నాయుడు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీజన్ వ్యాధులు డెంగ్యూ, మలేరియా వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సూపర్వైజర్ దివనమ్మ వారి సిబ్బంది, టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ బజార్ పునరుద్ధరణకు ప్రణాళికలు సిద్ధం చేయండి

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : విశాఖలో పురాతనమైన నెహ్రూ బజారు శిధిలావస్థకు చేరుకుంటున్నందున, దాని అభివృద్ధికి పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని జీవీఎంసీ అధికారులను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. గురువారం ఆయన విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్, 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు లతో కలసి జోన్ 3, 27వ వార్డులో నున్న నెహ్రూ బజార్ ను, డైమండ్ పార్కును పరిశీలించారు. ఈ పరిశీలనలో శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖ నగరంలో పురాతనమైన నెహ్రూ బజార్ నగరం మధ్యలో ఉన్నందున అధికంగా ప్రజలు వస్తువుల కొనుగోలుకు వస్తున్నారని, బజార్లో పలు దుకాణాలు శిధిలావస్థకు చేరుకున్నాయని, వాటి మరమ్మతులు చేపట్టి అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తూ నెహ్రూ బజార్‌ను పునరుద్ధరణ చేపట్టి, చేపలు, మాంసం, కూరగాయలు, ఇతర వ్యాపారాలకు అనుగుణంగా వ్యాపారస్తులకు ఇబ్బందులు కలగకుండా నెహ్రూ బజార్‌ను పునరుద్ధరణ చేపట్టి అందంగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్‌కు శాసనసభ్యులు సూచించారు. 27వ వార్డులో పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు పారిశుద్ధ్య కార్మికులు సరిపడనంతగా లేనందున వారిని ఏర్పాటు చేయాలని, సచివాలయాల్లో వార్డు కార్యదర్శులు విధులు నిర్వహణకు తగినంత స్టేషనరీ, కంప్యూటర్లు, ప్రింటర్లను మంజూరు చేయాలని వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలనలో కమిషనర్ శాసనసభ్యులు, వార్డ్ కార్పొరేటర్ తో కలిసి నెహ్రూ బజార్‌ను కలియ తిరిగి పరిసరాలను పరిశీలించారు. కూరగాయలు, చాపలు, మాంసం వ్యాపారం చేస్తున్న వారితో మాట్లాడుతూ నెహ్రూ బజార్లో ఎంతమంది ఎన్ని సంవత్సరాల నుండి వ్యాపారం చేస్తున్నారని, సరుకులు ఎక్కడినుంచి కొనుగోలు చేసి అమ్మకానికి తెస్తున్నారని, చికెన్ వ్యర్థాలను ఎక్కడికి తరలిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. వ్యాపారస్తులు స్పందిస్తూ 50 సంవత్సరాలు పైగా వారి పూర్వీకుల నుండి వంశపారపర్యంగా నెహ్రూ బజార్లో వ్యాపారం సాగిస్తున్నామని, 200 మందికి పైగా నెహ్రూ బజార్‌లో వ్యాపారం చేస్తున్నామని, నెహ్రూ బజార్ నందు మౌలిక సదుపాయాలు లేవని, పలు దుకాణాలు శిధిలావస్థకు చేరుకుని ఇబ్బందులకు గురవుతున్నామని, ప్రతి నెల వ్యాపారాలకు ఆసీలులు, షాపులకు అద్దెలు చెల్లిస్తున్నామని వాటి మరమ్మతులు చేపట్టి, మౌలిక సదుపాయాలు, కాలువలు,మరుగుదొడ్లు నిర్మాణం, తాగునీరు కల్పించాలని కమిషనర్‌కు, శాసనసభ్యులకు వారు విజ్ఞప్తి చేశారు. నెహ్రూ బజార్ ను అభివృద్ధిపరిచేందుకు పునరుద్ధరణ పనులను ప్రణాళికా యుతంగా చేపట్టేందుకు తగిన ప్రణాళికలను సిద్ధం చేయాలని, ప్రస్తుతం ఉన్న షాపులకు, నిర్మాణాలకు ప్రమాదాలకు గురికాకుండా మరమ్మతులు చేపట్టి, ప్రజలకు, వ్యాపారస్తులకు మౌలిక సదుపాయాలను కల్పించే దిశగా మరుగుదొడ్లు, తాగునీరు, కాలువలు ఏర్పాటు చేసి నెహ్రూ బజార్ ను పునరుద్ధరణ పరిచి అందంగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని, అందుకు తగిన ప్రణాళికలను సిద్ధం చేసి నివేదికను సమర్పించాలని పర్యవేక్షక ఇంజనీర్ పి వి వి సత్యనారాయణ రాజుకు కమిషనర్ ఆదేశించారు. నెహ్రూ బజార్ లో నిత్యం పారిశుద్య పనులను పరివేక్షించాలని, వార్డులో పారిశుద్య పనుల నిర్వహణలో అప్రమత్తంగా వుండాలని వార్డు శానిటేషన్ కార్యదర్శికి కమిషనర్ ఆదేశించారు. అనంతరం డైమండ్ పార్క్ లో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలను పరిశీలించి వాటి లోపాలను సరి సరిచేసి వాటికి పెయింటింగ్ వేయాలని సహాయక ఇంజనీర్ కు ఆదేశించారు. పార్కులో వ్యాయామం చేస్తున్న వారు కమిషనర్ ను, శాసనసభ్యులను కలసి డైమండ్ పార్క్ కు వ్యాయామం కొరకు ప్రజలు అధికంగా వస్తున్నందున ఉన్న పరికరాలకు అదనంగా మరికొన్ని వ్యాయామ పరికరాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయగా, పార్కులో అందుకు తగినంత స్థలాన్ని పరిశీలించి ఏర్పాటు చేస్తామని కమిషనర్ వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజనీర్లు గంగాధర్, మురళీకృష్ణ, సహాయక వైద్యాధికారి బి ప్రసాద్ రావు , అసిస్టెంట్ సిటీ ప్లానర్ మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు,

సకాలంలో అభివృద్ధిపనులు పూర్తి చేయండి : జీవీఎంసీ కమిషనర్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : ఒప్పందం ప్రకారం నిర్ణీయత సమయంలో జీవీఎంసీ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను, సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. గురువారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు, కాంట్రాక్టర్లు లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ ఒప్పందం ప్రకారం జీవీఎంసీ అభివృద్ధి పనులు నిర్ణీత సమయం లోనే పూర్తి చేయాలని ఆదేశించారు. విశాఖ నగరాభివృద్ధికి కాంట్రాక్టర్లు కూడా భాగస్వాములేనని, ప్రతి కాంట్రాక్టర్ వారికి ఇచ్చిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. టెండర్ కాల్ ఫర్ చేసినప్పటి నుండి పనులు పూర్తయ్యే వరకు పనులలో ఎటువంటి జాప్యం ఉండరాదని ఇంజనీరింగ్ అధికారులను హెచ్చరించారు. ప్రతి పని రూల్ బుక్ ప్రకారం పూర్తయ్యే విధంగా ప్రతిరోజు పనులను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. సచివాలయం పరిధిలో రెండు లేదా మూడు వర్కులు ఉంటాయని వాటిని పరిశీలించే బాధ్యత వార్డు ఎమినిటీ కార్యదర్శులను భాగస్వామ్యం చెస్తూ ప్రతిరోజు ఆయా పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. పనులు నిర్ణయించక ముందే ఆ పనిలో ఆటంకాలను గుర్తించి అన్నీ సరిపోయిన విదప టెండర్లను పిలవాలన్నారు. పనులలో సమస్యలు ఉంటే జోనల్ కమిషనర్ లేదా పై అధికారులకు తెలియపరచాలని ఆదేశించారు. పనుల ఆలస్యంపై కార్యనిర్వాహక ఇంజనీర్లను ఆరా తీస్తూ ఇకపై పనులు సకాలంలో పూర్తి అవకపోవడానికి వేరే సాకులను చెప్పరాదని హెచ్చరించారు. ముఖ్యంగా పనులు చేసేటప్పుడే క్వాలిటీ కంట్రోల్ ప్రతినిధులు ఆ పనుల నాణ్యతలో ఎటువంటి రాజీ లేకుండా పని చేయడంతో పాటు ఆ పని మొత్తం నమోదు చేయాలని ఆదేశించారు. నాణ్యతలో లోపం వలన ఎన్నో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున కాంట్రాక్టర్ వినియోగించే మెటీరియల్ లను తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. కాంట్రాక్టర్ పనులు పూర్తయిన వెంటనే వరుస క్రమంలో బిల్లులు చెల్లించేందుకు సహకరిస్తానని కమిషనర్ కాంట్రాక్టర్లకు తెలిపారు. అనంతరం కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు వారి సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఎప్పటినుండో వున్న ఈఎండిలును వెంటనే జారీ చేయాలని, అలాగే పనులు చేసిన విదప బిల్లులు ప్రక్రియకు వచ్చేసరికి బడ్జెట్ లేదని ఆ బిల్లును మరల బిల్లు జనరేట్ అయ్యే వరకు ఆపుతున్నందువలన చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని కమిషనర్ దృష్టికి తీసుకురాగా కమిషనర్ జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మను వాటిని పరిశీలించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో సమావేశం లో పర్యవేక్షక ఇంజనీర్లు కెవిఎన్ రవి, పివివి సత్యనారాయణ రాజు, కార్యనిర్వహక ఇంజనీరులు, ఉప కార్య నిర్వహణక ఇంజనీర్లు, జీవీఎంసీ కాంట్రాక్ట్ అసోసియేషన్ సభ్యులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి : జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ కాంట్రాక్టర్లు మరియు జీవీఎంసీ అధికారుల తో ఉమ్మడి సమావేశం కమిషనర్ ఏర్పాటు

చేయడం జరిగినది. ఈ యొక్క సమావేశంలో కమిషనర్ గారు ఇంజనీరింగ్ అధికారులకు కొన్ని అంశాలపై దిశా నిర్దేశం చేయడం జరిగినది అలాగే కాంట్రాక్టర్ల కూడా వర్క్ వచ్చిన వారం రోజుల్లో ఎగ్రిమెంట్ పూర్తిచేసి వర్క్ మొదలు పెట్టవలసిందిగా ఆదేశాలను జారీ చేయడం జరిగినది అలా చేయని యెడల వర్క్ క్యాన్సిల్ చేస్తామని లేనిచో లేట్ చేసిన ఎడల కాంట్రాక్టర్‌కి నోటీసు ఇస్తామని చెప్పడం జరిగింది తదుపరి కాంట్రాక్టర్ల యొక్క జీవీఎంసీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం సంజీవరెడ్డి, మాజీ అధ్యక్షులు పంప చంద్రమౌళి మాజీ ప్రధాన కార్యదర్శి సాదు రావు అలాగే ఆర్గనైజింగ్ సెక్రెటరీ మద్దాల రమేష్ కాంట్రాక్టర్లకు ఉన్న సమస్యలను వినిదీకరించగా ఈ సమస్యలను అధికారులతో చర్చించి ఈ సమస్యలు తీరే విధంగా కృషి చేస్తానని చెప్పడం జరిగినది విషయంలో ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో చెల్లించిన బిల్లులకు కమిషనర్ కి కృతజ్ఞతలు తెలియజేయగా వర్కులు చేస్తున్నప్పుడు వస్తున్న ఇబ్బందుల గురించి ఒక వినతిపత్రం రూపంలో కమీషనర్ గారికి ఇవ్వడం జరిగినది ఈ యొక్క మీటింగ్లో కార్యవర్గ సభ్యులు కాంట్రాక్టర్ సోదరులు పాల్గొన్నారు.

ఆగస్టు 28వ తేదీన 5వ జోన్‌లో బహిరంగ వేలం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ 5వ జోన్ పరిధిలోని పలు దుకాణాలు, కళ్యాణ మండపాలు, రోడ్ సైడ్ మార్కెట్లకు ఆగస్టు 28 ఉదయం 11 గంటలకు 5వ జోన్ (జ్ఞానాపురం) జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించబడునని జోనల్ కమిషనర్ బి.రాము గురువారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. మహా విశాఖ నగర పాలక సంస్థ, జ్ఞానాపురం, జోన్-5, పరిధిలోని వార్డు నెం.40 నుండి 63 వరకు ఖాళీగా ఉన్న దుకాణాలు, కళ్యాణ మండపములు, రోడ్డు సైడ్ మార్కెట్ల కు తేది 28.08.2025 (గురువారం) ఉదయం 11.00 లకు 5వ జోనల్ కార్యాలయము, జ్ఞానాపురం నందు దిగువ తెలిపిన వివరాలు ప్రకారం బహిరంగ వేలము నిర్వహించచడం జరుగుతుందని తెలిపారు. వార్డు నెం.60 గుల్లల పాలెం షాపింగ్ కాంప్లెక్స్ లో దుకాణము నెం. 8,22,23,24,46,47,48,51, 52,55,56,57,58, అశోక్ నగర్ షాపింగ్ కాంప్లెక్స్ లో దుకాణం నెంబర్ 1,2,3 మరియు ములగాడ షాపింగ్ కాంప్లెక్సు లో దుకాణము నెం.03 మరియు సుబ్బలక్ష్మి నగర్ షాపింగ్ కాంప్లెక్స్ లో దుకాణము నెం.02 షాప్ లకు మూడు సంవత్సరాల కాల పరిమితి వరకు మరియు వార్డు నెం 51 లోని మాధవ స్వామి కళ్యాణ మండపం నకు మూడు సంవత్సరాల కాల పరిమితి వరకు, మార్కెట్లలో గుల్లలపాలెం దుకాణము, రోడ్ పక్కన మార్కెట్లకు (హాకర్ మండలం) ఒక సంవత్సరం కాల పరిమితి వరకు వేలం పాట జరుగునని 5వ జోన్ జోనల్ కమిషనర్ తెలిపారు. కావున ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనేటప్పుడు వేలంపాటకు సంబంధించి ధరావత్తు మొత్తం డి.డి రూపంలో తీసుకురావాలని, ఎస్.సి రిజర్వుడు కేటగిరి వారు సంబంధిత కుల ధృవీకరణ పత్రం సమర్పించవలసి ఉంటుందని, వేలం పాటలో పాల్గొనే ప్రతి ఒక్కరు ఆధార్, పాన్ కార్డు కలిగి ఉండాలని, తదుపరి పూర్తి వివరణ కొరకు జోన్-5, జ్ఞానాపురం కార్యాలయము పని దినములలో పర్యవేక్షకులను సంప్రదించగలరని జోనల్ కమిషనర్ తెలియజేశారు.

పోర్టు అండ్ డాక్ జాతీయ కార్మిక సమాఖ్య కార్యదర్శిగా కోనమంగయ్య నాయుడు

విశాలాంధ్ర-పెందుర్తి : ఆల్ ఇండియా పోర్ట్ అండ్ డాక్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శిగా విశాఖపట్నం జిల్లా పెందుర్తి ప్రాంతానికి చెందిన కోన మంగయ్య నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ ప్రెసిడెంట్ జీఎం కృష్ణమూర్తి నియామక పత్రంను మంగయ్య నాయుడుకు పంపించారు. మంగయ్య నాయుడుకు జాతీయ కార్యదర్శిగా పదవి లభించడం పట్ల పోర్టు ఉద్యోగులు కార్మికులతో పాటు పెందుర్తి ప్రాంతానికి చెందిన పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కోనమంగయ్య నాయుడు మాట్లాడుతూ పోర్ట్ ఎంప్లాయిస్ యూనియన్ లో 1976 నుండి కొనసాగుతూ, పోర్ట్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ లో 35 సంవత్సరాలు ఉద్యోగం చేసి 2014 లో పదవీ విరమణ చేసినట్లు తెలిపారు. అయితే యూనియలో కార్మికులకు సేవచేస్తుండటంతో 2021 లో యూనియన్ కోశాధికారిగా భాధ్యతలు అప్పగించారని వెల్లడించారు. 2022లో ఆల్ ఇండియా పోర్ట్ అండ్ డాక్ వర్కర్స్ ఫెడరేషన్ కి ఆర్గనైజయింగ్ సెక్రటరీ గా నియమించారని తెలిపారు. జూలై 11 న జరిగిన ఫెడరేషన్ నేషనల్ కన్వెన్షన్ లో సెక్రటరీ గా నియమించి ఫెడరేషన్ పెద్దలు భాధ్యతలు అప్పజెప్పారని తెలియజేశారు. పోర్టుల జాతీయ కార్మిక సమాఖ్య కార్యదర్శిగా నియమించినందుకు ఫెడరేషన్ అధ్యక్షులకు ధన్యవాదములు తెలియజేస్తూ దేశములో ఉన్న ప్రధాన రేవులలో పనిచేస్తున్న కార్మికులకు సేవ చేసే అవకాశం కలిగినందుకు సంతోషిస్తున్నట్లు మంగయ్య నాయుడు తెలియజేశారు. తనకు ఇచ్చిన భాధ్యతను సక్రమంగా నిర్వర్తించి కార్మికులకు అండగా నిలిచి ఫెడరేషన్ పేరు ప్రఖ్యాతులను మరింత ఇనుమడింప చేస్తానని ఆయన పేర్కొన్నారు.

సామ్‌సంగ్ గెలాక్సీ జెడ్ ఫోల్డ్7కి డిమాండ్

విశాలాంధ్ర-విశాఖపట్నం : భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్‌సంగ్, గెలాక్సీ జెడ్ ఫోల్డ్7 కోసం తాము అపూర్వమైన డిమాండ్‌ను అందుకున్నట్లు నేడు వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన మార్కెట్లలో ఈ స్మార్ట్‌ఫోన్'అవుట్-ఆఫ్-స్టాక్'గా ఉంది. అపూర్వమైన ఈ డిమాండ్‌ను తీర్చడానికి కంపెనీ నోయిడాలోని దాని తయారీ కర్మాగారంలో అవసరమైన చర్యలు తీసుకుంటోంది. సామ్‌సంగ్ ఇండియా, ఇంతకుముందు తమ ఏడవ తరం ఫోల్డబుల్స్ - గెలాక్సీ జెడ్ ఫోల్డ్7, గెలాక్సీ జెడ్ ఫ్లిప్7 మరియు గెలాక్సీ జెడ్ ఫ్లిప్7ఎఫ్ఈ కోసం భారతదేశంలో కేవలం 48 గంటల్లో రికార్డు స్థాయిలో 210,000ప్రీ ఆర్డర్‌లను అందుకున్నట్లు ప్రకటించింది. ఇది భారతదేశంలో ఫోల్డబుల్ స్మార్ట్ ఫోన్స్, వేగవంతంగా ప్రధాన స్రవంతిలోకి రావడాన్ని సూచిస్తుంది. "గెలాక్సీ జెడ్ ఫోల్డ్7 కు బ్లాక్ బస్టర్ ప్రారంభం ఇచ్చినందుకు భారతదేశంలో సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వినియోగదారులకు మేము కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. దేశంలోని అనేక మార్కెట్లు భారీ డిమాండ్ కారణంగా కొరతను ఎదుర్కొంటున్నాయని మాకు తెలుసు. వీలైనంత త్వరగా మా అత్యంత అధునాతన స్మార్ట్‌ఫోన్, గెలాక్సీ జెడ్ ఫోల్డ్7ను వినియోగదారులు ఆస్వాదించడానికి వీలుగా తగినంత సరఫరాను నిర్ధారించడానికి మేము ఓవర్ టైం పని చేస్తున్నాము. రిటైల్ మార్కెట్లు మరియు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల నుండి బలమైన డిమాండ్ వస్తోంది, "అనిసామ్‌సంగ్ ఇండియా ఎంఎక్స్ బిజినెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజు పుల్లన్ అన్నారు.

ప్రపంచ వినియోగదారుల హక్కులు పరిరక్షణపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-పెందుర్తి : ప్రపంచ వినియోగదారుల హక్కుల పరిరక్షణ పై మురళి నగర్ గాయత్రి విద్యా మందిర్ లో గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గాయత్రి విద్యా మందిర్ వ్యవస్థాపక చైర్మన్ జగదీశ్వర్ రావు పర్యవేక్షణలో 7 నుండి 10వ తరగతి వరకు బాల బాలికలు తల్లిదండ్రులతో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ రామానుజ స్వామి చైర్మన్ అండ్ ఫౌండర్ డబ్ల్యు సి ఆర్ పి., డాక్టర్ రంగాల బాబురావు నేషనల్ జాయింట్ సెక్రటరీ డబ్ల్యు సి ఆర్, పి. బి అప్పలరాజు ట్రెజరర్ డబ్ల్యు సి ఆర్ పి, మార్టిన్ పేరెరా సౌత్, ఇండియా జనరల్ సెక్రెటరీ డబ్ల్యు సి ఆర్ పి, రిషి విశాఖ డిస్ట్రిక్ట్ చైర్మన్ డబ్ల్యు సి ఆర్ పి. హరిబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సౌత్ ఇండియా జనరల్ సెక్రెటరీ మార్టిన్ పేరా అధ్యక్షత వహించగా, చైర్మన్ డాక్టర్ రామానుజ స్వామి మాట్లాడుతూ భారతదేశంలో 1986 డిసెంబర్ 24వ తేదీన చట్టానికి రాష్ట్రపతి ఆమోదం తర్వాత మరల 2019 న అనేక మార్పులతో చట్టాన్ని వినియోగదారులకు అందుబాటులోనికి తీసుకొచ్చారని తెలిపారు. దానిలో ప్రోడక్ట్ లైబిలిటీ అనే అంశం చాలా ముఖ్యమైనదని, దాని ద్వారా ఏదైనా వస్తువును వినియోగదారులు కొనుగోలు చేసిన ఎడల ఆ వస్తువు వలన వినియోగదారులకు ఏదైనా నష్టం జరిగితే దానికి తయారుదారులు, అమ్మకం దారులు పూర్తి బాధ్యత వహిస్తూ చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించవలసిన పరిస్థితి ఉంటుందని, కాబట్టి తయారు దారులు ఆ ప్రోడక్ట్ కి సంబంధించి క్వాలిటీ, ప్రొటెక్టివిటీ, స్టాండర్డ్స్, తప్పనిసరిగా మెయింటైన్ చేయాలన్నారు. లేనిచో చట్ట ప్రకారం శిక్షకు అర్హులవుతున్నారు అని తెలియజేశారు. నేషనల్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ రంగాల బాబురావు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యకరమైనటువంటి ఆహార పదార్థాలు తినడం అలవాటు చేసుకోవడం. అలాగే ఫాస్ట్ ఫుడ్ కి దూరంగా ఉండాలని, ఆరోగ్యం కాపాడుకోవాలని, విద్యలో ముందుండాలని, అలాగే చదువుతోపాటు చెస్ లో కూడా ప్రావీణ్యం సంపాదించాలని సూచించారు. చెస్ నేర్చుకోవడం వల్ల జీవితంలో వ్యూహం, సహనం, మేధస్సు విజ్ఞానం అలవాటుతాయి అన్నారు. సాధారణ విద్యార్థి కంటే చదరంగం ఆడిన విద్యార్థి అన్నింటిలో ముందుంటాడని, విద్యార్థులు అందరూ చదువుతోపాటు చదరంగం నేర్చుకోవాలని తెలియజేశారు. ట్రెజరర్ బి అప్పలరాజు మాట్లాడుతూ సైబర్ క్రైమ్ తో విద్యార్థులు మోసపోకుండా జాగ్రత్త పడాలి అన్నారు. సౌత్ ఇండియా జనరల్ సెక్రెటరీ మాట్లాడినప్పుడు వినియోగదారుల హక్కులను తెలియజేశారు. జిల్లా చైర్మన్ మాట్లాడుతూ వినియోగదారులతో చట్టాన్ని అవగాహన చేసుకొని కొనుగోలు సమయములో వస్తువులపై వివరాల తెలుసుకొని కొనుగోలు చేయాలి అని అన్నారు.

కొత్తగా 2543 మందికి పింఛన్లు మంజూరు

నేడు ఇంటి వద్ద పంపిణీ

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా పరిధిలో ఏప్రిల్ 2019 నుండి నేటివరకు ఎన్ టి ఆర్ భరోసా పింఛను పొందుతూ చనిపోయిన వారి భార్యలకు వితంతువు పింఛను కొత్తగా మంజూరు చేసారు. విశాఖపట్నం జిల్లాకి జూలై 2025 నెల నుండి కొత్తగా 2,524 మందికి వితంతు పింఛన్లు, కిడ్నీ వ్యాధితో బాధపడుతూ వివిధ ఆసుపత్రుల్లో డయాలసిస్ చేయించుకుంటున్న 19 మందికి కలిపి రూ.1.03 కోట్లులతో భరోసా పింఛన్లు మంజూరు చేసారు. ఈ కొత్త పింఛన్లతో పాటు, ఇప్పటికే పింఛన్లు పొందుతున్న 1,58,235 మందికి వివిధ సామాజిక భద్రతా పింఛన్ల రూపంలో రూ.69.34 కోట్లు విడుదల చేశారు. విశాఖపట్నం జిల్లా మొత్తం మీద 1,60,778 లబ్ధిదారులకు రూ.70.36 కోట్లు విడుదల చేశారు. ఈ పింఛన్లను ఆగస్టు 1వ తేది ఉదయం 6.30 గంటలకు మీ ఇంటి వద్దకు గ్రామ/ వార్డు సచివాలయ సిబ్బంది తీసుకుని వచ్చి పంపిణీ చేస్తారు. ఏదైనా కారణంతో ఆ రోజు పింఛన్ పొందలేని లబ్దిదారులకు ఆగస్టు 2వ తేదీ నాడు కూడా పంపిణీ కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో గౌరవ శాశనసభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికార్లు పాల్గొనున్నారు. పెన్షన్ లబ్దిదారులందరూ ఆగస్టు 1, 2 తేదీలలో తమ గ్రామాలలో అందుబాటులో ఉండాలని అధికారులు తెలిపారు.

రోగులకు పరికరాలు పంపిణీ



విశాలాంధ్ర-అనందపురం : ఉమా నారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవలే జులై 6 వ తేదీన జరిగిన దంత, వైద్య శిబిరంలో 18 మంది రోగులకు ఉచితంగా కంటి ఆపరేషన్ చేయించడం జరిగింది అలాగే 12 మంది రోగులకి రూట్ కెనాల్ ట్రీట్మెంట్ చేయడం జరిగింది అలాగే దృష్టిలోపం ఉన్న పేషెంట్లకు 108 మందికి ఉచితంగా అద్దాలు పంపిణీ కార్యక్రమంలో శ్రీమహాలక్ష్మి కల్చర్ అసోసియేషన్ అధినేత ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, అలాగే ఆనందపురం సిఐ వాసునాయుడు పాల్గొని వాళ్ళందరికీ అద్దాలు పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా ఉమా నారాయణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బమ్మిడి శ్రీతారక్ మాట్లాడుతూ సమాజానికి ఆయన ఒక ఆదర్శం కావాలని ఆయన చూసి మరి ఎంతోమంది యువత సేవా దృక్పథంతో ముందుకు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు పాల్గొనడం జరిగింది.

ఎంఏసీటీ-2025కి దరఖాస్తులు ఆహ్వానం

రేపటి నుంచి మిల్లేనియం అప్టిట్యూడ్ & కోడింగ్ టెస్ట్

విశాలాంధ్ర-విశాఖపట్నం : "అప్టిట్యూడ్ టెస్టులు మన అందరిలో ఉన్న సహజ ప్రతిభ, బలాలు మరియు పరిమితులను బయటపెడతాయి" అని మిల్లేనియం సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సెంట్రల్ మేనేజర్ వరదా రవి కుమార్ అన్నారు. గురువారం నాడు వారి ద్వారకానగర్ బ్రాంచ్ లో మిల్లేనియం అప్టిట్యూడ్ & కోడింగ్ టెస్ట్ (ఎం ఏ సీ టీ) - 2025" పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పరీక్షలు విద్యార్థుల ఆలోచనా స్థాయిని పెంపొందిస్తాయని, తద్వారా వారు పోటీ పరీక్షలను సులభంగా అధిగమించగలరని తెలిపారు. ప్రొఫెషనల్ నాలెడ్జ్‌తో పాటు క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ కూడా విద్యార్థులు మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎంఏసీటీ అనేది ఇప్పటివరకు మిల్లేనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే మిల్లేనియం అప్టిట్యూడ్ టెస్ట్‌కు అప్డేటెడ్ వెర్షన్ అని వివరించారు. ఈ సంవత్సరం ప్రత్యేకంగా కంప్యూటర్ స్ట్రీమ్ విద్యార్థుల కోసమై కోడింగ్ టెస్ట్ ను కూడా ప్రవేశపెట్టామని చెప్పారు. అమెజాన్, టెస్లా, టీసీఎస్, ఇన్ఫోసిస్ తదితర అంతర్జాతీయ కంపెనీలు ఇంటర్వ్యూకు ముందు అప్టిట్యూడ్ టెస్ట్ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎంఏ సీటీ వంటి పరీక్షలు విద్యార్థులు తమ స్థాయిని తెలుసుకోవడానికి ఉత్తమ అవకాశం అని వివరించారు. గత సంవత్సరం సుమారు 5500 మంది విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొనగా, 1000 మంది విద్యార్థులు మెరిట్ స్కాలర్ షిప్ కి ఎంపికయ్యారన్నారు. మిల్లేనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ హెచ్.ఆర్ మేనేజర్ బి.దివ్యజ్యోతి అన్నారు. ఈ సంవత్సరం ఎం ఏ సీ టీ 2025 లో అర్హత సాధించిన విద్యార్థులకు రూ.50 లక్షల విలువైన స్కాలర్షిప్ అందించబడతాయని ఆమె ప్రకటించారు. పరీక్షలు సూచించిన షెడ్యూల్ ప్రకారం కళాశాలలలో ఆగస్టు 2 నుండి సెప్టెంబర్ 28, 2025 వరకు ప్రతి శనివారం, ఆదివారం మిల్లేనియం క్యాంపస్ లో నిర్వహించబడ తాయని వివరించారు. పరీక్షలో పాల్గొనదలచిన అభ్యర్థులు ఆగస్టు 1 నుండి millenniumsoftsol.com/mact వెబ్సైట్లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఇతర సమాచారం కోసం 92487 53106, 91540 84157 నంబర్లకు సంప్రదించవచ్చు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంతోష్ (బిడిఎం), అశోక్ (బిడిఈ) తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ

- రైతుల ఖాతాల్లో నేరుగా జమ - జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్



విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : ఆగస్టు 2వ తేదీ జిల్లా లో అన్నదాత సుఖీభవ కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయం నుంచి అన్నదాత సుఖీభవ, ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ తో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ విసి కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, అగ్రికల్చరల్ అధికారి అప్పలస్వామి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ఆగస్టు 2వ తేదీ న అన్నదాత సుఖీభవ కార్యక్రమం ప్రారంభించడానికి అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో పండగ వాతావరణంలో నిర్వహించాలని, రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వం అందించే ఇళ్లను పూర్తి చేయాలి



విశాలాంధ్ర-అనందపురం : మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండలంలోని ఎన్టీఆర్ నగర్ గృహ నిర్మాణ లబ్ధిదారులు ఇళ్లను త్వరగా పూర్తి చేయించాలని హౌసింగ్ స్పెషల్ సెక్రటరీ ఆదేశాల మేరకు మార్చి 2026లోగా అసంపూర్తిగా ఉన్న ఇల్లు అన్ని పూర్తి చేయాలని అదనపు సాయంగా ఎస్సీ బీసీలకు 50 వేల రూపాయలు ఎస్టీలకు 75 వేల రూపాయలు మంజూరు చేశారని లబ్ధిదారులందరికీ తెలియపరచి ఇంటి నిర్మాణం పూర్తి చేసే విధంగా చూడాలని గతంలో అడ్వాన్స్ పేమెంట్ ఇచ్చిన ఇల్లు నాటినుండి నేటి వరకు తదుపరి నిర్మాణం చేయని లబ్ధిదారుల ను అవగాహన పరచి తదుపరి నిర్మాణం వేగంగా జరిగేలాగా చూడాలని ఎండి తెలిపారు .ఈ ప్రక్రియ అంతా ఆగస్టు 15లోగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలియపరిచారని ఈ సమావేశం నందు ఇంజనీరింగ్ అసిస్టెంట్ లందరికీ ఆదేశాలు జారీ చేశారు .ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జానకి హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సూరిబాబు , అసిస్టెంట్ ఇంజనీర్ శ్యామ్ సుందర్ వర్క్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ అన్ని పంచాయతీల కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

3న నగరంలో ఫిల్మ్ ఫెస్టివల్

విశాలాంధ్ర-విశాఖ : వైజాగ్ సినీఫైల్స్, ట్రావెలింగ్ కోల్‌కతా పీపుల్స్ ఫిల్మ్ ఫెస్టివల్ సంయుక్తంగా విశాఖలో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు వైజాగ్ సినీఫైల్స్ ప్రతినిధి సుజన్ తెలిపారు. ఆగస్టు 3న దాబా గార్డెన్స్ లోని వీజేఎఫ్ ప్రెస్ క్లబ్లో మధ్యాహ్నం 3 నుండి రాత్రి 9 గంటల వరకు ఈ ఫెస్టివల్ జరుగుతుందని తెలిపారు. ఢిల్లీ నుండి హైదరాబాద్ వరకు, పశ్చిమ బెంగాల్ నుండి పాకిస్తాన్‌లోని సింధ్ వరకు సామాన్య ప్రజల కథలను నగరంలోని సినిమా ప్రేమికుల వద్దకు తీసుకొస్తున్నామని చెప్పారు. ఆర్థిక సంక్షోభం మొదలు సామాన్య ప్రజల హక్కులు, సంక్లిష్టమైన ప్రేమలు, మతవిశ్వాసాల వరకు అనేక ముఖ్యమైన ఇతివృత్తాలకు సంబంధించిన షార్ట్ ఫిల్మ్స్ ప్రదర్శిస్తామని తెలిపారు.

కమ్యూనిటీ భవనాలు ప్రారంభం

విశాలాంధ్ర మల్కాపురం : పారిశ్రామి ప్రాంతం పరిధి 58వ వార్డు శ్రీహరిపురం గుల్లలపాలెం గ్రామంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వారు 42 లక్షల రూపాయలు మరియు ములగాడ గ్రామంలో 12లక్షల రూపాయలు సి.ఎస్.ఆర్ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ భవనాలు గురువారం ప్రభుత్వ విప్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు గణబాబు ముఖ్య అతిథిగా పాల్గొని కమ్యూనిటీ భవనాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోరమండల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జ్ఞాన సుందరం, ఏ.వి.పి. హెచ్.ఆర్ నారాయణ, సీనియర్ ఏ.వి.పి రంగ కుమార్, సి.ఎస్. ఆర్.హెడ్ జై గోపాల్, జి.ఎం. హెచ్ఆర్ శ్రీనివాస్, డిప్యూటీ మేనేజర్ సి ఎస్ ఆర్ వెంకటరమణ, శ్రీకాంత్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దుర్గాప్రశాంతి, స్టేట్ వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రామ్మోహన్ నాయుడు,వార్డు అధ్యక్షులు కోరాడ శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ ఉమామహేశ్వర్, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ వార్డు ప్రధాన కార్యదర్శి పోతాబత్తుల శ్రీనివాస్, గుల్లలపాలెం మరియు ములగాడ గ్రామ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీ తెలుగు ఆధ్వర్యంలో జీ రైటర్స్ రూమ్ సెలక్షన్స్... ఈ ఆదివారం మన విశాఖపట్నంలో!



విశాలాంధ్ర-విశాఖపట్నం : ఆసక్తికరమైన, ఆలోచనలు రేకెత్తించే కథలతో బుల్లితెర ప్రేక్షకులను అలరిస్తున్న జీ తెలుగు ఔత్సాహిక రచయితలకు గొప్ప అవకాశాన్ని అందిస్తోంది. జీ రైటర్స్ రూమ్ కేవలం ప్రతిభను వెలికితీసే ప్రయత్నం మాత్రమే కాదుఇది 'యువర్స్ ట్రూలీ %%' అనే కంపెనీ బ్రాండ్తో ప్రారంభమైన ఒక సృజనాత్మక ఉద్యమం. ఈ కార్యక్రమం జీ యొక్క అన్ని ప్లాట్ఫామ్లలో కథలను మరింత సమర్థవంతంగా మార్చడమే లక్ష్యంగా మొదలైంది. సరికొత్త దృక్పథాల కోసం పెరిగిన డిమాండ్ నేపథ్యంలో, సృజనాత్మకత కలిగిన రచయితలను గుర్తించడంతోపాటు సృజనా సామర్థ్యం, రచయితల వృత్తిగత ప్రపంచం మధ్య అంతరాన్ని తగ్గించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఎంపికైన రచయితలకు విస్తృతమైన '%%' సంస్థలోని టీవీ, డిజిటల్, సినిమా ప్లాట్ఫామ్ల కోసం సమర్థవంతమైన, ఆకర్షణీయమైన కథలను రూపొందించే అవకాశం లభిస్తుంది. దేశవ్యాప్తంగా జరుగుతున్న జీ రైటర్స్ రూమ్ కార్యక్రమంలో భాగంగా జీ తెలుగు ఆగస్టు 3న విశాఖపట్నం వేదికగా రచయితలను ఎంపిక చేయనుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని తెలుగు రచయితలను ప్రోత్సహించడమే లక్ష్యంగా జీ తెలుగు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. జీ తెలుగులో రాబోయే సీరియల్స్కి బలమైన కథలను రాసే రచయితలతోపాటు సినిమా కథకులను సైతం ఎంపిక చేయనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు రాత పరీక్షలో పాల్గొనాల్సి ఉంటుంది. ఈ పరీక్షలో ఎంపికైన అభ్యర్థులు రైటర్స్ రూమ్లో చేరే అవకాశం లభిస్తుంది. ఈ జాబితాలో ఎంపికైన రచయితలకు పరిశ్రమ నిపుణులు రచనాశైలిలో మెలకువలు నేర్పిస్తారు. జీ నుంచి రాబోయే ప్రాజెక్టులలో ఈ రచయితలు భాగమయ్యే అవకాశం ఉంటుంది. ఈ కార్యక్రమం గురించి జీ ఎంటర్టైన్మెంట్ ఎంటర్ప్రైజెస్ లిమిటెడ్, జీ తెలుగు, తమిళం, %డ్గజుజు%5 తెలుగు చీఫ్ కంటెంట్ ఆఫీసర్ అనురాధ గూడురు మాట్లాడుతూ.. 'జీ రైటర్స్ రూమ్ ఔత్సాహిక రచయితలు వారిలోని సృజనాత్మకతను వెలికితీసే ఒక అద్భుతమైన అవకాశం. ఈ కార్యక్రమం ద్వారా ఎంపికైన రచయితలు మా సంస్థలోని విభిన్న వేదికలపై రూపొందే సీరియల్స్, సినిమాలు, వెబ్సిరీస్లకు కథలను అందిస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న రచయితలు తమలోని ప్రతిభకు సానపెట్టి సరికొత్త కథలతో భవిష్యత్తుకు బాటలు వేసుకునే చక్కని అవకాశం. విశాఖపట్నంలో ఈ ఆదివారం జరగనున్న సెలక్షన్స్ను తెలుగు రచయితలు సద్వినియోగపరుచుకోవాలి.' అన్నారు.

విశాఖపట్నంలో జీ రైటర్స్ రూమ్ ఆడిషన్స్ వివరాలు :

వేదిక : యూనిటీ డిగ్రీ కాలేజీ, 32-1-53, బౌదరా రోడ్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ - 530004. ఫోన్ నెం: 9246298135

తేదీ: ఆగస్టు 3, 2025

సమయం: ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు

తెలుగు కథల్లోని సాంస్కృతిక వైవిధ్యాన్ని, భావోద్వేగాలను ప్రతిబింబించే కథకులను ప్రోత్సహించి వారిని శక్తివంతమైన రచయితలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా జీ తెలుగు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. సినిమా రచయితగా మారాలని కలలు కనే ఉత్సాహవంతులకు జీ తెలుగు అందిస్తున్న అద్భుత అవకాశం.. మీ కథలతో సిద్ధంగా ఉండండి, సినీ రచయితగా మారే అవకాశం అందుకోండి!

ఉద్యోగ విరమణ శేష జీవితానికి పునాది

- అధికారులు, ఉద్యోగులు శేష జీవితాన్ని ఆనందంగా గడపండి.

- జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ

విశాలాంధ్ర-విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థలో ఎంతో బాధ్యతగా సుదీర్ఘకాలం విధులు నిర్వహించి నేడు ఉద్యోగ విరమణ పొందుతున్న ప్రతి ఒక్కరి శేష జీవితం ఆనందదాయకంగా ఉండాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ .ఎస్. వర్మ పేర్కొన్నారు. గురువారం ఆయన మహా విశాఖపట్నం నగరపాలక సంస్థలో వివిధ హోదాలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న యు సి డి ప్రాజెక్ట్ ఆఫీసర్గా విధులు నిర్వహిస్తున్న స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ డి. లక్ష్మి, స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందుతున్న పర్యవేక్షకులు వై.మంజుల, సీనియర్ అసిస్టెంట్ కె.వసంతలతో పాటు మరో 12 మంది ఉద్యోగులను యుసీడి ప్రాజెక్టు డైరెక్టర్ పి.ఎం సత్యవేణి లతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ అదనపు కమిషనర్ మాట్లాడుతూ జీవీఎంసీలో జూనియర్ అసిస్టెంట్గా చేరి అంచెలంచెలుగా పదోన్నతులను, అందరి మన్ననలను పొందుతూ నేడు గ్రేడ్ 1 మున్సిపల్ కమిషనర్ స్థాయిలో ఉద్యోగ విరమణ పొందుతున్న డి. లక్ష్మి సేవలను గుర్తించి ప్రభుత్వం నేడు స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ గా ఆమెకు పదోన్నతిని కల్పించడం అందరికీ ఆనందదాయకంగా ఉన్నప్పటికీ నేడు జీవీఎంసీ నుండి ఉద్యోగ విరమణ పొంది ఆమె వెళ్తున్నందుకు బాధగా ఉందని అదనపు కమిషనర్ ఆమె సేవలను ప్రశంసిస్తూ ఆమె శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని కోరుకుంటున్నానని తెలిపారు. అలాగే సుదీర్ఘకాలం జీవీఎంసీలో పనిచేసి నేడు సూపరింటెండెంట్ గా స్వచ్ఛంద పదవీ విరమణ పొందుతున్న వై.మంజుల సేవలు ఎనలేనివని, ఆమె ఏ విభాగంలో పనిచేసిన చిత్తశుద్ధితో విధులు నిర్వహించే వారని, అలాగే జీవీఎంసీలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తూ నేడు ఉద్యోగ విరమణ పొందుతున్న కె.వసంత సేవలు కూడా ఎనలేనివని వారిని అదనపు కమిషనర్ ప్రశంసించారు. నేడు జీవీఎంసీలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న వాచ్మెన్ వై. అప్పారావు,పబ్లిక్ హెల్త్ వర్కర్లు ఎం .రాము, బి .నారాయణరావు, ఎ .శ్రీరాములు, జి లక్ష్మి ,జి వీర్రాజు, ఔట్సోర్సింగ్ పిహెచ్ వర్కర్లుగా జి ,భూలోకమ్మ, ఎల్ .దుర్గారావు ,ఆర్, రమణమ్మ ,పి .రామయ్యమ్మ, పి.అప్పలనరసమ్మ, , బాల్యం టీచరు యు .మేనకా దేవి లు ఇకపై సమయాన్ని, ఆరోగ్యం కొరకు వ్యాయామం ,ధ్యానం పై దృష్టి సారించాలని, ఆహార నియమాలు పాటిస్తూ ఆనందంగా కుటుంబ సభ్యులతో శేష జీవితాన్ని గడపాలని కోరుకుంటున్నానని అదనపు కమిషనర్ తెలిపారు. ప్రతి ఉద్యోగి తన ఉద్యోగ కాలంలో తన కుటుంబం కంటే అధిక కాలాన్ని సంస్థ కొరకు పని చేశారని పేర్కొన్నారు. నేడు ఉద్యోగ విరమణ పొందుతున్న 15 మంది శేష జీవితాలు ఆనందదాయకంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం జీవీఎంసీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.ఎం సత్యవేణి మాట్లాడుతూ పదవీ విరమణ ప్రతి ఒక్కరికి తప్పదని ఈరోజు ఉద్యోగ విరమణ పొందుతున్న అందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ వారి శేష జీవితం ఆనందంగా గడపాలని కోరుకుంటున్నానని ఆమె తెలిపారు. అనంతరం అదనపు కమిషనర్ ఉద్యోగ విరమణ పొందిన వారిని ఘనంగా సన్మానించి , పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలను అందించారు. ఉద్యోగులకు సంబంధించిన ప్రావిడెంట్ ఫండ్ ను సుమారు రూ ఒక కోటి 39క్షలను అందించడం జరుగుచున్నదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె .కనకమహాలక్ష్మి, యుసిడి ప్రాజెక్ట్ ఆఫీసర్ పి ప్రసన్న వాణి ,డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శాంతి కుమారి, ఎ . ఒ.అప్పలనాయుడు, ఏపీడీలు, సూపరింటెండెంట్లు సన్యాసిరావు ,రియాజ్ అధికారులు ,ఉద్యోగులు పాల్గొన్నారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

విశాలాంధ్ర-పెదగంట్యాడ: విధి నిర్వహణలో చేసిన సేవలే చిరస్థాయిగా నిలుస్తాయని ఐ.ఎన్.టి.యూ.సి జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. గురువారం ఉక్కు ఇన్స్ట్రుమెంటేషన్ భవన్లో ఉద్యోగ విరమణ చేస్తున్న జి వెంకటేశ్వర రావు అభినందన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి రాజ శేఖర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారంలో సుదీర్ఘ కాలం విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందడం హర్షణీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ విరమణ చేస్తున్న వెంకటేశ్వరరావును మేమెంటో, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గందం వెంకట్రావు, నీరు కొండ రామ చంద్రరావు, వై.వి.రమణ, ఉద్యోగులు జె.శ్రీనివాస్, చీకటి శ్రీనివాస్, ఏళ్లేటీ శ్రీనివాస్నాయుడు, పెద్దాడ నాగేశ్వరరావు, మొల్లి ఈశ్వర్ రావు పాల్గొన్నారు.

తిరునక్షత్ర దినోత్సవ సందర్భంగా సుదర్శన హోమం

విశాలాంధ్ర-పెదగంట్యాడ : జీవీఎంసీ 65వ వార్డు గాజువాక గరుడాద్రి కొండపై వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈరోజు శ్రావణమాసం గురువారం ఉదయం 8 గంటల నుండి ప్రారంభమైన శ్రీ సుదర్శనుల తిరునక్షత్ర మహోత్సవ సందర్భంగా ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల, ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో సుదర్శన హోమం అభిషేకం ప్రత్యేక పూజలు వేద పండితులు మంత్రాచోలతో అత్యంత వైభవముగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హిందూ ధర్మ రక్షణ సమితి అధ్యక్షురాలు కొత్తలంక భువనేశ్వరి శర్మ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ఉత్తర ముఖాన వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయాలలో గరుడాద్రి కొండపై వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయం ఒకటి అని అన్నారు. స్వామివారికి సుదర్శన హోమం అభిషేకాలు చేయడం ద్వారా భక్తులకు, గ్రామానికి ఎంతో శుభదాయకమని అన్నారు. వెంకటేశ్వర స్వామి కురిసిన వారికి కోరిన కోర్కెలు తీరుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లాభాల భవాని ప్రసాద్, ఉషారాణి, హిమజ, చిట్టమ్మ, సత్యవతి, నాగమణి, చిన్నమ్మలు, పెంటకోట రాజు, సంతోష్ మరియు భక్తులు పాల్గొన్నారు.